క్లుప్తంగా

గ్రామ సభలో ఉపాధి పనుల గుర్తింపు

కోసూరువారిపాలెం(మోపిదేవి): మండలంలోని కోసూరువారిపాలెం, మేళ్లమర్తిలంక సచివాలయాల వద్ద ఆయా గ్రామ సర్పంచ్‌లు కోసూరు అనూష, కొలసాని వెంకట కృష్ణ అధ్యక్షతన ఉపాధి పనుల గుర్తింపు గ్రామ సభలు బుధవారం నిర్వహించారు. రాబోవు 2025–26 ఆర్థిక సంవత్సరానికి ఉపాధి పనులు కోసూరువారిపాలెం గ్రామ సభలో 27 పంట బోదులు, చెరువులు 2, మినీ గోకులాలు 2 ఎన్‌ఆర్‌ఈజీస్ కింద పనులు చేపట్టనున్నట్లు పీఎఫ్‌టీ వెంకటేశ్వరమ్మ తెలిపారు. మోపిదేవి లంక గ్రామ సభలో 18 పంట బోదులు గుర్తించినట్లు వివరించారు. ఉప సర్పంచ్ కోసూరు రాధాకృష్ణమూర్తి, ఎఫ్‌ఏ రాజ్యలక్ష్మి, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

మచిలీపట్నంటౌన్: ఈ నెల 13వ తేదీన విజయవాడలో జరిగే గురుదేవ్ శ్రీ రవిశంకర్ నిర్వహించే మహాసత్సంగం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శ్రీ రవిశంకర్ ప్రథమ శిష్యుడు రుషి దేవరత్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన నగరంలో పాదయాత్ర నిర్వహించారు. మహాసత్సంగం కరపత్రాలను ఆవిష్కరించిన అనంతరం జిల్లా పరిషత్ సెంటరు నుంచి కోనేరుసెంటర్ వరకు ఈ పాదయాత్ర నిర్వహించారు. రాబర్ట్‌సన్‌పేట లోని శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయానికి చేరుకుగంధర్వగాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

టెన్నికాయిట్ పోటీలకు ఎంపిక

కృత్తివెన్ను: టెన్నికాయిట్ రాష్ట్రస్థాయి పోటీలకు మండలానికి చెందిన రాళ్లరేవు ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పీడీ నాగరాజు తెలిపారు. ఇటీవల గూడూరులో జరిగిన జిల్లా స్థాయి టెన్నికాయిట్ పోటీల్లో పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను గ్రామస్తులు, ఎంఈవో– 2 ప్రసాదరావు, విద్యాకమిటీ చైర్మన్ మురళీకృష్ణ, సర్పంచు సునీల్ ప్రత్యేకంగా అభినందించారు.

మెరుగైన వైద్యం అందిస్తాం

మచిలీపట్నంటౌన్: జిల్లా సర్వజన ఆసుపత్రిలో పేద రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు తన వంతు కృషి చేస్తానని ఆసుపత్రి సూపరింటెండెంట్ జి.భానుమూర్తి అన్నారు. ఇటీవల సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయనను బుధవారం మునిసిపల్ ఉద్యోగుల సంఘ ప్రతినిధులు, దళిత సంఘాల నాయకులు, పలు పార్టీల నాయకులు బుధవారం ఆసుపత్రిలోని ఆయన చాంబర్‌లో దుశ్శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. భానుమూర్తి మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. ఆసుపత్రిలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించి వైద్యసేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

మినుము విత్తనాలు సిద్ధం

పెదప్రోలు(మోపిదేవి): మండల పరిధిలోని పెదప్రోలు గ్రామంలో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం సర్పంచి పొలిమెట్ల ఏసుబాబు అధ్యక్షతన గ్రామ సచివాలయంలో నిర్వహించారు. అవనిగడ్డ ఏడీఏ ఎస్.జయప్రద, మండల ఏవో హెప్సిబారాణి మాట్లాడారు. ఎల్‌బీజీ 752 రకం మినుము విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు వివరించారు. వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయిని ఎంపిక

గూడూరు: ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీలకు జెడ్పీ హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయిని మత్తి అరుణ ఎంపికయ్యా రు. బుధవారం ఏఎన్‌యూలో ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ పోటీలకు రాష్ట్ర జట్టు ఎంపికలు జరిగాయి. లాంగ్ జంప్, 100 మీటర్ల పరుగు విభాగంలో సెలక్షన్స్‌లో అరుణ లాంగ్ జంప్‌లో మొదటి స్థానం, 100 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానం సాధించారు. దీంతో వచ్చే జనవరిలో గుజరాత్‌లో జరిగే పోటీలకు ఎంపిక చేశారు. అరుణను హెచ్‌ఎం డి.పుష్పలత, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి నాగపుట్ట వద్ద అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగుల చవితి సందర్భంగా పుట్ట పూజ నిర్వహించిన అనతరం పుట్టలో ఆవుపాలు పోసి కార్యక్రమాలను ప్రారంభించారు. ఆలయ డీసీ డీఎస్‌ఆర్ వరప్రసాదరావు ఆధ్వర్యంలో ఆలయ ప్రధానార్చకులు బుద్దు పవన్‌కుమార్‌శర్మ, వేదపండితులు నౌడూరి సుబ్రహ్మణ్యశర్మ, మణిదీప్ శర్మ, బుద్దు సతీష్, ఫణికుమార్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

యువకుడి అదృశ్యం

అవనిగడ్డ: చల్లపల్లికి చెందిన వివాహిత యువకుడు బొడ్డు సుమంత్ అదృశ్యం అయ్యాడు. స్నేహితుని వద్దకు వెళ్లొస్తానని చెప్పి బుధవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిన సుమంత్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేయడంతో అనుమానం వచ్చిన తల్లిదండ్రులు స్నేహితులు, బంధువులను వాకబు చేశారు. అయినా ఆచూకీ తెలియక పోవడంతో గాలింపు చర్యలు చేపట్టారు. పులిగడ్డ – పెనుమూడి వారధిపై సుమంత్ బైక్‌ని గుర్తించిన కొంత మంది ఆయన తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. బైక్ పక్కన సుమంత్ ఫోన్, పర్స్ లభించడంతో నదిలోకి దూకి ఉంటాడని అనుమానిస్తున్నారు. ఈ మేరకు చల్లపల్లి పోలీస్ స్టేషన్‌లో సుమంత్ తండ్రి సుధాకర్ (పండు) ఫిర్యాదు చేశారు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. సుమంత్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం చెప్పారు.

ఉచిత ఇసుక దొరకదు.. కూలీలకు పని ఉండదు

ఇసుక కొరతతో ఉపాధి కోల్పోతున్న భవన నిర్మాణ కార్మికులు

- సామాన్యులకు అందుబాటులో లేని ఇసుక ధర
- నిరాశతో తిరిగి వెళుతున్న కార్మికులు
- గత నాలుగు నెలలుగా పనులు లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు
- అప్పులు చేసి పని కోసం మచిలీపట్నం వస్తున్న వైనం



పనికి పిలిచేవారికోసం గాంధీబొమ్మ శివాలయం వద్ద ఎదురుచూస్తున్న భవన నిర్మాణ కార్మికులు

మచిలీపట్నంటౌన్: ఇసుక కొరత కారణంగా భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోతున్నారు. పని కోసం ప్రతిరోజూ నగరంలోని పలు కూడళ్లకు చేరుకుంటున్నారు. భవన యజమానులు పిలుస్తారని ఆశగా ఎదురుచూసి పని లేక ఇంటి బాట పడుతున్నారు. దీంతో ఉపాధి లేక అప్పులు చేసి కుటుంబాలను పోషించుకోవాల్సి వస్తోందని కార్మికులు వాపోతున్నారు.

ప్రభుత్వం ఓ పక్క ఉచిత ఇసుకను అమలు చేస్తున్నామని చెబుతుండగా మరో పక్క నగరంలో ఇసుక అమ్మకాలు మరింత ప్రియంగా ఉండటంతో భవన నిర్మాణ పనులు ఎక్కడికక్కడే నిలిచి పోయాయి. దీంతో తాపీ మేస్త్రీ నుంచి కూలీల వరకు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారు.

500 మందికి పైగా కార్మికులు..

నగరంలో దాదాపు 500 మంది కార్మికులు ప్రతిరోజు పని కోసం పలు కూడళ్లలో వేచి ఉన్నా పనికి పిలిచేవారు లేకపోవటంతో నిరాశతో వెనుతిరగాల్సి వస్తోంది. నగరంతో పాటు చుట్టుపక్కల ఉన్న మండలాల్లోని గ్రామాల నుంచి ఇక్కడకు వస్తున్న కార్మికులకు పని దొరకటం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రస్తుతం వ్యవసాయ పనులు కూడా లేకపోవటంతో తాపీ పని దొరుకుతుందని వస్తున్న కార్మికులకు నిరాశే ఎదురవుతోంది.

కార్మికుల పడిగాపులు..

నగరంలోని గాంధీబొమ్మ శివాలయం సెంటర్, నాగపోతరావుసెంటర్, కోనేరుసెంటర్, రేవతి సెంటర్, జిల్లా పరిషత్ సెంటర్ ఇలా పలు కూడళ్ల వద్ద పని కోసం భవన నిర్మాణ కార్మికులు ప్రతిరోజు ఉదయం ఎదురుచూస్తూ ఉంటారు. కూలీల అడ్డాలుగా పిలువబడే ఈ ప్రాంతాల్లో ఎదురుచూపులతో కాలం గడిచిపోతోంది.



ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు దుర్గారావు ఇతను పుట్టు మూగ, చెవుడుతో బాధపడుతున్నాడు. ఇతనికి ఇద్దరు పిల్లలు స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీలో జీవిస్తున్నాడు. భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అయితే గత మూడు నెలలుగా ఉపాధికి ఇబ్బంది కలగటంతో కుటుంబ జీవనం ఇబ్బందిగా మారింది. అప్పులు చేసి జీవించాల్సిన పరిస్థితి ఏర్పడిందని దుర్గారావు తనకు తోచిన సైగలతో ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

అప్పుల పాలవుతున్నాం..



మా ప్రాంతంలో ఉపాధి లేక ప్రతిరోజు మచిలీపట్నం వస్తున్నాను. ఇక్కడకు వచ్చి పని కోసం వేచి ఉన్నా పని దొరకటం లేదు. గత మూడు నెలలుగా ఇక్కడకు వచ్చినా పని దొరక్కపోవటంతో నిరాశతో ఇంటికి వెళ్లాల్సి వస్తోంది. ఇల్లు గడవడానికి, పిల్లల చదువుల ఖర్చులకు రోజు మచిలీపట్నం వచ్చి వెళ్లేందుకు అప్పు చేయాల్సి వస్తోంది. చేతి నిండా పని ఎప్పుడు దొరుకుతుందోనని ఎదురు చూస్తున్నాను.

– వేకుల నాగరాజు,
అర్తమూరు, బంటుమిల్లి మండలం

రూ.100 చార్జీ పెట్టి వచ్చినా..



భవన నిర్మాణ పని కోసం మా ఊరి నుంచి మచిలీపట్నంకు రోజూ ఆటోలో వస్తున్నా. రోజుకు రూ. 100 చార్జీలు అవుతున్నాయి. ఎంత సేపు ఎదురు చూసినా ఎవరూ పనికి పిలవడంలేదు. ఇలా నాలుగు నెలలుగా ఇబ్బంది పడుతున్నా. చేతికి పని దొరక్కపోవటంతో ఇంట్లో ఖర్చులకు అప్పులు చేయాల్సి వస్తోంది. పిల్లలను చదివించేందుకు ప్రభుత్వ సాయం కూడా అందటం లేదు. అంతా అయోమయంగా ఉంది.

– మునిపల్లి నాగరాజు,
పోలవరం, గూడూరు మండలం

ట్రాక్టర్ ఇసుక రూ.6 వేల పైనే..

కృష్ణానది పరీవాహక ప్రాంతం నుంచి నగరానికి ట్రాక్టర్లపై ఇసుక వస్తోంది. ట్రాక్టర్ ఇసుక ధర రూ.6 వేల నుంచి రూ.6,500 వరకు విక్రయిస్తున్నారు. దీంతో అత్యవసర పనులు ఉన్న భవన నిర్మాణాలకే ఇసుకను కొనుగోలు చేస్తున్నారు. ఈ కారణంగా కొద్ది మంది కార్మికులకే పని దొరుకుతోంది. ఎక్కువ మంది కార్మికులకు పని దొరక్కపోవటంతో ఉపాధి దొరక్క అప్పుల పాలవుతున్నారు. సామాన్యులకు ఇసుక ధర అందుబాటులో లేకపోవటంతో పనులు ఊపందుకోలేదు. ఇది భవన నిర్మాణ కార్మికులకు శాపంగా మారింది.

నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చూడాలి

– కలెక్టర్ డీకే బాలాజీ



చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో రహదారుల మరమ్మతులు, అభివృద్ధి పనులకు సంబంధించి నాణ్యత, ప్రమాణాలు కచ్చితంగా పాటించేలా పర్యవేక్షించాలని కలెక్టర్ డీకే బాలాజీ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు, ఉపాధిహామీ సిబ్బంది, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు పనుల నిర్వహణపై జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో బుధవారం వర్క్‌షాప్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని గ్రామాల్లో రహదారులను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. మెటీరియల్ నాణ్యతతో పాటు రహదారులు ఎక్కువ కాలం మన్నేలా పనులు చేపట్టాలన్నారు. కాంట్రాక్టర్లు తీసుకువచ్చిన మెటీరియల్ నాణ్యతగా ఉందా, లేదా పర్యవేక్షించాలన్నారు. ఏపీఆర్‌ఆర్‌పీ ప్రాజెక్టు అడ్వయిజర్ కె.ప్రభాకరరెడ్డి రహదారులు, అభివృద్ధిపనులకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వర్క్‌షాప్‌లో వివరంచారు. పంచాయతీరాజ్ ఎస్‌ఈ రమణారావు, డ్వామా పీడీ ఎన్‌వీ శివప్రసాద్‌యాదవ్, పీఆర్‌ఈఈ సిద్ధార్థగౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ఎంఎంసీ సాధారణ సమావేశం

మచిలీపట్నంటౌన్: ఈ నెల 8న నగరపాలక సంస్థ సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు క్యాటిల్ డిపో వద్ద ఉన్న సమావేశ మందిరంలో ఈ సమావేశం జరుగుతుందన్నారు. ఐదు అంశాలతో కూడిన ఎజెండాపై చర్చించి తీర్మానించటం జరుగుతుందన్నారు. కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు సకాలంలో హాజరుకావాల కోరారు.

హెడ్ వాటర్ వర్క్స్‌ను తనిఖీ చేసిన కలెక్టర్

కమిషనర్‌కు పలు సూచనలు



హెడ్ వాటర్ వర్క్స్‌లోని ఫిల్టర్‌బెడ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నంటౌన్: నగర ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని సంమృద్ధిగా అందించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించారు. స్థానిక హెడ్ వాటర్ వర్క్స్‌ను కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇక్కడున్న ఫిల్టర్‌బెడ్లు, క్లారిఫైర్ల పనితీరును పరిశీలించారు. బురదనీటిని తొలగించేందుకు రెండు హైస్పీడ్ సబ్‌మెర్సిబుల్, సీవేజ్ పంపులను కొనుగోలు చేశామని, వీటి ద్వారా బురదను తొలగించే ఏర్పాట్లు చేస్తున్నామని కమిషనర్ బాపిరాజు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సోమవారం నగరంలోని భాస్కరపురం, రాజుపేట, గొడుగుపేట, హౌసింగ్‌బోర్డుకాలనీ ప్రజలు సరఫరా అవుతున్న తాగునీరు బురద, దుర్వాసనతో వస్తున్నాయని ఫిర్యాదు చేశారన్నారు. వెంటనే నీటి ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను ఆడిట్ చేయమని, క్లారిఫై లోకేటర్‌లో బురద ఉన్నట్లు కనిపించిందని, దీని మొత్తాన్ని బయటకు తీసే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రానున్న మూడు, నాలుగు రోజుల్లో ఈ పనులు పూర్తి చేస్తామన్నారు. తొలుత డంపింగ్‌యార్డును కలెక్టర్ పరిశీలించారు. నగరం నుంచి రోజూ 84 టన్నుల చెత్తను సేకరించి దీనిలో రెండు కంపాక్టర్ల ద్వారా 18 టన్నుల చెత్తను గుంటూరు జిల్లాలోని కొండవీడు జిందాల్ పవర్ ప్లాంట్‌కు పంపించటం జరుగుతోందని కమిషనర్ కలెక్టర్‌కు వివరించారు. స్పందించిన కలెక్టర్ రోజుకు ఎంత చెత్త వస్తుందో మరోసారి పరిశీలించి వివరాలు తెలియజేయాలని సూచించారు. సీఎం హామీ మేరకు చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ఎప్పటికప్పుడు చెత్తను తరలించే ప్రయత్నం చేయాలన్నారు. మూలనపడ్డ మరో కంపాక్టర్‌కు మరమ్మతులు చేయించి మరో తొమ్మిది టన్నుల చెత్తను పవర్ ప్లాంట్‌కు పంపించాలని సూచించారు. మరో కొత్త కంపాక్టర్‌ను కొనుగోలు చేయాలని కమిషనర్‌కు కలెక్టర్ సూచించారు. కృష్ణా విశ్వవిద్యాలయానికి రెండు కిలోమీటర్ల దూరంలో నూతన డంపింగ్‌యార్డు కోసం 13.40 ఎకరాల స్థలాన్ని వినియోగంలోకి తేవాలని కమిషనర్‌కు కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట మునిసిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, డీఈ కుబియానాయక్, ఏఈ తేజశ్రీ పాల్గొన్నారు.

వేధింపులకు పాల్పడితే కేసులు నమోదు చేస్తాం



కోడూరు: విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు సత్ప్రవర్తన కలిగి ఉండి, మంచి విద్యాబుద్ధులు నేర్పాలని ఎస్‌ఐ చాణిక్య అన్నారు. మండలంలో ఆరు నెలల వ్యవధిలో నలుగురు ఉపాధ్యాయులపై బాలికల వేధింపుల కేసులు నమోదు కావడంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో బుధవారం స్వతంత్రపురం జెడ్పీ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఎస్‌ఐ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలికల పట్ల ఉపాధ్యాయులు మర్యాదపూర్వకంగా వ్యవహరించడంతో పాటు వారికి మంచిచెడులు చెప్పాలని సూచించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఉపాధ్యాయులు బాలికల పట్ల అసభ్యకరంగా వ్యవహరిస్తే పోక్సో చట్టం కింద కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. మండలంలో నాలుగు ఘటనలు జరగడంపై ఉపాధ్యాయులు కూడా ఆలోచన చేయాలన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలు, గంజాయికి దూరంగా ఉండాలన్నారు. మైనర్లు ద్విచక్ర వాహనాలు నడిపే తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ స్పష్టం చేశారు. హెచ్‌ఎం ఆలా వెంకటరమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివిసీమలో ఆయిల్ పామ్ పంట విస్తరించాలి



పాపవినాశనం లంక భూముల్లో ఆయిల్ పామ్ మొక్కనాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

పాపవినాశనం(ఘంటసాల): దివిసీమలో ఆయిల్ పామ్ పంట విస్తరించాలని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. మండలంలోని పాపవినాశనం లంకభూముల్లో రైతు, మాజీ సర్పంచ్ మునిపల్లి బుజ్జి భూమిలో ఆయిల్ పామ్ మొక్కలు నాటి పంట సాగును ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఆయిల్ పామ్ పరిశ్రమ ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరముందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు జిల్లా కలెక్టర్ ఆయిల్ పామ్ పంటను మన ప్రాంతంలో పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా ఉద్యానశాఖాధికారి జే జ్యోతి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఘంటసాల, చల్లపల్లి, అవనిగడ్డ మండలాలు ఆయిల్ పామ్ సాగుకు అనుకూలంగా ఉన్నట్లు పరిశీలన బృందం నిర్ధారించిందన్నారు. ఈ పంట 40 ఏళ్ల పాటు ఆదాయం ఇస్తుందని, వనరులు పెంచేందుకు ప్రభుత్వం రైతులకు ప్రోత్సాహం అందిస్తుందన్నారు. ఉండవల్లి ఆగ్రోస్ డీజీఎం బి.హరికృష్ణ, వైస్ ఎంపీపీ కుంపటి నాగేంద్ర బాబు, సర్పంచ్ కుంపటి అనిత, తహసీల్దార్ బి.విజయ ప్రసాద్, ఉద్యానశాఖాధికారి జె.కీర్తిదేవి, ఎంపీటీసీ తాడికొండ చిన్నా, వీఆర్వో శివప్రసాద్, వీఏఏ ఎం.లావణ్య, రైతు సంఘం నేతలు వేమూరి రత్నగిరి, హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, అట్లూరి వెంకటేశ్వర రావు, తుమ్మల చౌదరి బాబు, రైతులు, ఉండవల్లి ఆగ్రోస్ సిబ్బంది పాల్గొన్నారు. ఆది ఆంధ్ర ఫీల్డ్ లేబర్ కోఆపరేటివ్ సొసైటీ భూమిని తిరగి సొసైటీకి ఇప్పించాలని కోరుతూ వైస్ ఎంపీపీ కుంపటి నాగేంద్ర బాబు ఆధ్వర్యంలో సొసైటీ సభ్యులు ఎమ్మెల్యేను కోరారు.

రివిట్‌మెంట్ ప్రతిపాదన

నాగాయలంక: స్థానిక కృష్ణానది తీరంలోని చిన కరకట్ట కింద నివాసిత ప్రాంతంలో మత్స్యకార కుటుంబాల రక్షణకు రివిట్‌మెంట్ ప్రతిపాదించినట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ వెల్లడించారు. బుధవారం ఆకస్మికంగా పర్యటించారు. స్థానిక శ్రీరామ పాదక్షేత్రం పుష్కరఘాట్ ఎదుట నది మధ్యలో ఉన్న లంక ప్రాంతాన్ని తహసీల్దార్ ఎం.హరనాథ్, ఎస్‌ఐ కె.రాజేష్ ఇరిగేషన్ డీఈఈ పులిగడ్డ వెంకటేశ్వరరావులతో కలిసి సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ నాగాయలంక చిన పడవల రేవు నుంచి ఘాట్ వరకు రివిట్‌మెంట్ నిర్మాణానికి అంచనాలు రూపొందించాలని ఇరిగేషన్ డీఈఈని ఆదేశించారు. ఉప సర్పంచి తలశిల నాని, శ్రీరామపాద క్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, కార్యదర్శి జరుగు పవన్‌కుమార్ ఎమ్మెల్యేను కలిశారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు 2,500 పైగా దరఖాస్తులు



ఆన్‌లైన్ దరఖాస్తులను ప్రింట్ తీస్తున్న తహసీల్దారు కార్యాలయం ఎన్నికల విభాగం సిబ్బంది

పెడన: పెడన అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను, గూడూరు ఈ నాలుగు మండలాల్లో ఇప్పటి వరకు సుమారు 2,500 పైగా దరఖాస్తులు అందినట్లుగా తెలుస్తోంది. దరఖాస్తుల సంఖ్య అధికంగా ఉన్నా వాస్తవంగా ఎంత మంది ఓటరుగా నమోదవుతారనే విషయంలో ఒకటి రెండు రోజుల్లో స్పష్టత రానున్నదని అధికారులు పేర్కొంటున్నారు.

బీఎల్‌వోల విచారణ..

ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా వచ్చిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసిన దరఖాస్తులను ఆయా చిరునామాల ప్రకారం బూత్‌స్థాయి (బీఎల్‌వో) అధికారులకు ఎన్నికల విభాగం సిబ్బంది అప్పగిస్తున్నారు. ఈ నెల 8వ తేదీలోగా విచారణ చేసి అప్పగించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో బూత్‌స్థాయి అధికారులు చిరునామాలు తెలుసుకుంటూ ఒరిజనల్ ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి ఓకే చేస్తున్నారు.

గతంలో 2,923 మంది ఓటర్లు

గతంలో పెడన అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరుగా 2,923 మంది ఉన్నారు. ప్రస్తుతం వీరితో పాటు కొత్త వారు కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. గతంలో ఆయా మండలాలవారీగా ఓటర్లను పరిశీలిస్తే పెడనలో 1,012 మంది పట్టభద్రుల ఓటర్లు ఉంటే బంటుమిల్లిలో 762, గూడూరులో 597, కృత్తివెన్నులో 552 మంది ఉన్నారు.

దరఖాస్తులు అధికంగా వచ్చాయి..



ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌ల ద్వారా అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించాం. పట్టభద్రుల ఎమ్మెల్సీకి ఓటరుగా నమోదుకు చాలా మంది ఆన్‌లైన్ ద్వారానే దరఖాస్తు చేశారు. వచ్చిన దరఖాస్తులు వచ్చినట్టు విచారణకు ఆదేశించాం. ఎన్ని వచ్చాయనే విషయంలో ఒకటి రెండు రోజులు సమయం పడుతుంది.

– కె.అనిల్‌కుమార్,
ఇన్‌చార్జి తహసీల్దారు, పెడన

కేవీకేలో ముగిసిన శిక్షణ



ఘంటసాల: శిక్షణ పొందిన సహకార సంఘాల ప్రతినిధులు సమర్ధవంతంగా విధులు నిర్వహించాలని స్థానిక కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి అన్నారు. కృషి విజ్ఞాన కేంద్రంలో సమగ్ర పోషక యాజమాన్యంపై 30 మంది సహకార సంఘాల ప్రతినిధులకు 15 రోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి.కేవీకే సమన్వయకర్త డాక్టర్ సుధారాణి మాట్లాడారు. శిక్షణ పొందిన అభ్యర్థులు తమ అనుభవాలను తెలియజేశారు. కోర్సు ఇన్‌చార్జి కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ రేవతి, ఘంటసాల వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సత్యప్రియ లలిత, శాస్త్రవేత్తలు పద్మావతి, లహరి, కేవీకే శాస్త్రవేత్తలు మంజువాణి, యశ్వంత్, వెంకటలక్ష్మి, కృష్ణవేణి పాల్గొన్నారు.

రామలింగేశ్వరునికి అయ్యప్పల నీరాజనం



నాగాయలంక: స్థానిక కృష్ణానది తీరంలోని శ్రీరామ పాదక్షేత్రం వద్ద అంబా సాయి కిరణ్‌శర్మ అయ్యప్ప పీఠం ఆధ్వర్యంలో అయ్యప్ప దీక్షాపరులు ఘాట్‌లో రామలింగేశ్వరస్వామికి బుధవారం రాత్రి భక్తిశ్రద్ధలతో నీరాజనాలు పలికారు. తొలుత అంగరంగ వైభవంగా భక్తి గీతాలపన సమర్పించి విశేష పూజ జరిపారు. అయ్యప్పల బృందంచే కోటి వత్తులకు జ్యోతి ప్రజ్వలన చేశారు. అంబా సాయి కిరణ్ శర్మ ఆధ్వర్యంలో నవ హారతులను ఆవిష్కరించారు. మంత్ర పుష్ప నీరాజనం, తీర్థ ప్రసాద వితరణ జరిగింది. మహిళలు వివిధ ఆకృతులలో రూపొందించిన స్టాండ్‌లకు నూనె ప్రమిదలతో దీపాలంకరణ చేశారు. క్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, ఉప్పల లీలాకృష్ణప్రసాద్, తలశిల రఘుశేఖర్, బోయపాటి రాము, కనిగంటి నారాయణ తదితరులు పర్యవేక్షించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



బేస్, సాఫ్ట్‌బాల్ రాష్ట్ర సెలక్షన్స్‌కు ఎంపికైన విద్యార్థులు

నాగాయలంక: కృష్ణా జిల్లా గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల గ్రౌండ్స్‌లో 5వ తేదీన జరిగిన బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్ జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో నాగాయలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌కు చెందిన 14 మంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాల హెచ్‌ఎం పీవీఎస్‌వీప్రసాద్ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం బేస్‌బాల్ అండర్–17 విభాగంలో జి.హాసిని, తమ్మ తనూషా, వల్లీశ్రీ, ఆర్.హరీష్, కె.సంతోష్, సాఫ్ట్‌బాల్ అండర్– 17 విభాగంలో ఎం.దివ్య, కె.జాహ్నవి, పి.లీలశ్రీ, టి.యశ్వంత్‌సాయి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్– 14 సాఫ్ట్‌బాల్‌లో పి.హాసిని, ఎస్.జ్యోతిరాణి, కె.వీరేంద్ర, అండర్– 14 బేస్‌బాల్‌లో ముమ్మారెడ్డి సిరి, టి.రాహుల్‌లు కృష్ణా జిల్లా జట్టులో ప్రాతినిధ్యం వహించేందుకు ఎంపికయ్యారు. ఈనెల 9 నుంచి గుంటూరు జిల్లా యనమదలలో జరిగే బేస్‌బాల్ రాష్ట్రస్థాయి సెలక్షన్స్‌లో, కాకినాడ జిల్లా గొల్లపాలెంలో 28 నుంచి జరిగే సాఫ్ట్‌బాల్ రాష్ట్ర స్థాయి సెలక్షన్స్‌లో ఈ బాలబాలికలు పాల్గొంటారు. ఎంపికైన బాలికలు, తర్ఫీదు ఇచ్చిన పాఠశాల పీడీలు గాజుల లక్ష్మీప్రసాద్, కోసూరు పూర్ణచంద్రరావులను పీఎంసీ చైర్మన్ వక్కపట్ల లీలామారుతి, స్కూలు స్టాఫ్ అభినందించారు.

ఘంటసాల: మండలంలోని ఘంటసాల, శ్రీకాకుళం హైస్కూల్ ప్లస్, గోగినేనిపాలెం గ్రామాల్లోని హైస్కూల్స్ విద్యార్థులు జిల్లా స్థాయి సాఫ్ట్ బాల్, బేస్ బాల్ పోటీల్లో సత్తాచాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు అమ్మిరెడ్డి అనుపల్లవి రెడ్డి, ఎం.శ్రీరంగవల్లి, తమ్మన వేణుగోపాలరావు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగళవారం గన్నవరంలో జరిగిన జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు అండర్–14, అండర్ –17 బాలురు, బాలికల విభాగాల్లో విజేతలుగా నిలిచారన్నారు. ఆయా విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీలకు చెందన అర్హులైన అభ్యర్థులు మెగా డీఎస్సీ రిక్రూట్‌మెంట్ పరీక్షల కోసం ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారి జి.రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వంద మంది అభ్యర్థులకు రెండు నెలల పాటు ఉచిత శిక్షణ, స్టైఫండ్, స్టడీమెటీరియల్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ శిక్షణకు టెట్ పరీక్ష క్వాలిఫై అయిన అభ్యర్థులు మాత్రమే అర్హులన్నారు. డీఈడీ, టీటీసీ మార్కుల ఆధారంగా సెకండరీ గ్రేడ్ టీచర్స్ అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. ఎంపిక కాబడిన అభ్యర్థులను నవంబరు 2024 నుంచి మచిలీపట్నంలోని శ్రీ పద్మావతి మహిళా కళాశాలలో శిక్షణ తరగతులు నిర్వహించబడతాయన్నారు. అర్హులైన అభ్యర్థులు బయోడేటాతో పాటు పదో తరగతి, డీఈడీ, లేదా టీటీసీ మార్కుల లిస్టు, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, రేషన్, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, జిరాక్స్, మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో జత చేసి నవంబరు 11వ తేదీ సాయంత్రం 5గంటల్లోగా పద్మావతి మహిళా హిందూ కళాశాలలో సమర్పించాలన్నారు. వివరాలకు 98494 20123, 94413 09317 నంబర్లను సంప్రదించలన్నారు.

నేడు స్కిల్ సెన్సెస్‌పై శిక్షణ

గూడూరు: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్కిల్ సెన్సెస్‌పై గురువారం మండల స్థాయి శిక్షణ తరగతులు గూడూరులో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బి.రాజేశ్వరి తెలిపారు. ఇప్పటికే స్కిల్ సెన్సెస్‌పై జిల్లా స్థాయి శిక్షణ తరగతులు నిర్వహించగా, గురువారం మండల స్థాయి శిక్షణ తరగతులు గూడూరులోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే తరగతులకు మండలంలోని వివిధ సచివాలయాల సిబ్బంది విధిగా హాజరుకావాలని ఆమె కోరారు.

మహారాజశ్రీ కృష్ణాజిల్లా మచిలీపట్నం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగారి కోర్టులో
S.C. O.P. No. 7/2024
(In the Estate of deceased Sanaka Srinivasa Rao)
Between:
(2nd Petitioner is being minor Rep. by her mother natural guardian Sivarupa i.e. 1st Petitioner) ... పిటిషనర్లు
... 7PPF ... రూ. 1,23,221/-
మచిలీపట్నం
ది. 06-11-2024